చెక్కు చెదరని చారిత్రక ఆనవాళ్లు

- గత చరిత్రకు కేరాఫ్ అడ్రస్ నూజివీడు
- నాటి నిర్మాణ, వాస్తు శైలికి ప్రతీకలుగా కట్టడాలు

నూజివీడు: రాచరికాలు పోయినా, రాజ్యాలు అంతరించినా నాటి కట్టడాలు మాత్రం చారిత్రక సంపదగా నేటికీ దర్శనమిస్తున్నాయి. కట్టడాల్లోని ప్రతి రాయీ నాటి వైభవానికి, గత చరిత్రకు సజీవ సాక్షిగా నిలుస్తోంది. జమీందారీ పాలనకు, కోటలు, గుమ్మాలు, చారిత్రక కట్టడాలకు జిల్లాలోని నూజివీడు ప్రసిద్ధి చెందింది. అప్పటి జ్ఞాపకాలను ఇప్పటి తరానికి గుర్తుచేస్తూ చారిత్రక కట్టడాలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి.

పౌరుష, పరాక్రమాల పురిటి గడ్డగా, జమీందారీ పాలనకు నిలయమైన నూజివీడు పట్టణ నిర్మాణం 565–75 సంవత్సరాల మధ్య జరిగినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. ఆనాటి రాజరికానికి ఆనవాలుగా పట్టణంలోని గుర్రం గేటు, కుక్కల గేటు, పీజీ కేంద్రం నిలువుటద్దంగా నిలుస్తున్నాయి. 200 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు గేట్లు నేటికీ ఇక్కడి జమీందారీ పాలనను గుర్తుకు తెస్తూ దర్శనమిస్తున్నాయి. కోటకు దక్షిణ, ఉత్తర ద్వారాలుగా కుక్కల గేటు, గుర్రం గేటులను ఆనాడు నిర్మించారు.


పీజీ కేంద్రం నిర్వహిస్తున్న రాజమహల్


గుర్రం గేటు


కుక్కల గేటు

ఈ రెండు ద్వారాల మధ్య ఉన్న సంస్థానం నుంచి నాటి జమీందార్లు పాలన సాగించేవారు. నూజివీడు జమీందారు రంగాయప్పారావు దక్షిణ ద్వారంపై పహారా కాస్తున్న సైనికులకు తోడుగా ఉన్న కుక్కల విగ్రహాలు చెక్కిన శిల్పాలు ఉంటాయి. అందుకే ఇది కుక్కల గేటుగా ప్రసిద్ధి. ఉత్తర ద్వారంపై గుర్రంపై ఉన్న విజయరాయ అప్పారావు విగ్రహం ఉంటుంది. దీంతో ఈ ద్వారాన్ని గుర్రం గేటుగా పిలుస్తారు. నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఈ గేట్లకు మరమ్మతులు చేయించి రంగులు వేయించడంతో రాజరిక చరిత్రకు నిలువుటద్దంగా దర్శనమిస్తున్నాయి.

రాజమహల్..

నేడు కృష్ణా యూనివర్సిటీ పరిధిలో ఎమ్మార్ అప్పారావు పీజీ కేంద్రంగా పిలుచుకుంటున్న ఆనాటి రాజమహల్‌కు ఏళ్ల చరిత్ర ఉంది. నూజివీడు జమీందారుల్లో ఒకరైన కపిలేశ్వరపురం జమీందారు రాజా మేకా వెంకట రంగయ్య అప్పారావు 1906లో దీనిని నిర్మించారు. ఆ రోజుల్లోనే దీని నిర్మాణానికి రూ.4లక్షలు ఖర్చయిందని పూర్వీకులు చెబుతుంటారు. ఈ మహల్‌లోని విశాలమైన గదులు, వాడిన ఫర్నీచర్ ఆనాటి జమీందారుల జీవన స్థితిగతులను, నిర్మాణ కౌశలాన్ని ఇక్కడ చూడవచ్చు. దాదాపు 30 అంగుళాల మందంతో బలిష్ఠంగా నిర్మించిన గోడలు నేటికీ చెక్కు చెదరలేదు. దర్వాజాలు, కిటికీలు, తలుపులు రాజరిక సౌందర్యానికి అద్దం పడుతున్నాయి. ఎమ్మార్ అప్పారావు 1975లో ఈ భవంతిలో పీజీ కేంద్రం ఏర్పాటు కోసం ఆంధ్రా యూనివర్సిటీకి వితరణగా అందజేశారు. ఆ తర్వాత ఇది నాగార్జున యూనివర్సిటీ పరిధిలోకి వెళ్లింది. ప్రస్తుతం ఈ పీజీ కేంద్రం కృష్ణా యూనివర్సిటీ పరిధిలో ఉంది.

పొంచి ఉన్న ప్రమాదం

గంపలగూడెం–తిరువూరు రహదారిపైకి పెరిగిన కర్రతుమ్మ చెట్లు


రహదారి పైకి వాలిన కర్రతుమ్మచెట్లు

గంపలగూడెం: గంపలగూడెం–తిరువూరు ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిలో పెరిగిన కర్రతుమ్మ చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. 16 కిలోమీటర్ల పొడవున ఉన్న రహదారిలో అనేక చోట్ల మార్జిన్‌లో కర్రతుమ్మచెట్లు దట్టంగా పెరిగాయి. చెట్లకొమ్మలు పలుచోట్ల రహదారిపై వాలిపోయాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలను దాటే సమయంలో చెట్లకొమ్మలు తగిలి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా మలుపుల వద్ద నెలకొన్న పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదార్లు చెట్లకొమ్మలు రాసుకొని గాయాలపాలవుతున్నారు. చెట్టుకొమ్మలు రహదారిపై వంగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాన్ని దగ్గరకు వచ్చే వరకు గుర్తించే పరిస్థితి లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో చెట్లు మరింత ఏపుగా పెరిగే అవకాశం ఉంది. నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు రేయింబవళ్లు తిరిగే రహదారిలో అధికారులు సత్వరమే చర్యలు చేపట్టాల్సి ఉంది.

క్లుప్తంగా

ఊరిస్తున్న మేఘాలు



ఆగిరిపల్లి: ఊరిస్తున్న నల్లని మేఘాలు ఎప్పుడు వర్షిస్తాయా అని రైతులు ఆశగా ఆకాశం వైపు తేరి చూస్తున్నారు. వారం రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. చుక్క చినుకు కురవడం లేదు. ఇప్పటికే వ్యవసాయ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. వర్షాలు కురిస్తే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతన్నలు సమాయత్తమవుతున్నారు. సోమవారం మధ్యాహ్నం ఆగిరిపల్లిలో దట్టమైన మేఘాలు కమ్మి భారీ వర్షం కురిసేలా వాతావరణం కనిపించింది. ఈదురు గాలులు వీచినా వర్షం కురవక పోవడంతో రైతులతోపాటు ప్రజలు నిరాశ చెందారు.

క్షీరబంధు చెక్కు అందజేత

వామకుంట్ల(తిరువూరురూరల్): మండలంలోని వామకుంట్లలో ఇటీవల మరణించిన పాల ఉత్పత్తిదారుడు వంగల గోవర్ధన్ కుటుంబానికి కృష్ణా మిల్క్ యూనియన్ క్షీరబంధు పథకం కింద సోమవారం ఆర్థికసాయం అందజేసింది. పాల ఉత్పత్తిదారులకు యూనియన్ కల్పించిన క్షీరబంధు పథకం ద్వారా రూ.50వేల ఆర్థికసాయాన్ని తిరువూరు క్లస్టర్ మేనేజర్ టి. సాంబశివమూర్తి గోవర్ధన్ కుటుంబసభ్యులకు అందజేశారు. గ్రామ పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు వంగల శేషగిరి, సభ్యులు పాల్గొన్నారు.

25న దేవాలయ భూమి కౌలుకు వేలం

ఇబ్రహీంపట్నం(మైలవరం): ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం రూరల్ కాచవరం గ్రామంలో వేంచేసియున్న రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూములను సేద్యం చేసుకునేందుకు ఒక సంవత్సర కాలానికి(2024–25) టెండర్ కమ్ బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాచవరంలోని సర్వే నంబర్ 62లోని 11.52 ఎకరాలకు ధరావతు సొమ్ము రూ.23,000, సర్వే నంబర్ 62లోని 10.22 ఎకరాలకు ధరావతు సొమ్ము రూ.20,000 చెల్లించాలన్నారు. ఈ నెల 25న మంగళవారం ఉదయం 11గంటలకు దేవాలయ ప్రాంగణంలో వేలం ప్రారంభమవుతుందన్నారు. ఇతర వివరాలకు కార్యనిర్వహణాధికారి సెల్ నంబర్ 90141 22629ను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం



గండేపల్లి(కంచికచర్ల): ఏసుప్రభువును ప్రతి ఒక్కరూ గుర్తెరిగి ఆయన ఆజ్ఞలను పాటిస్తే మంచి మేలులు జరుగుతాయని నందిగామ సీఎస్ఐ దయాసిస్ డీనరీ చైర్మన్ రెవరెండ్ చంద్రకుమార్ అన్నారు. మండలంలోని గండేపల్లి సీఎస్ఐ దేవాలయ 5వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా క్రీస్తు విశ్వాసులు గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ అందరూ క్రీస్తు అడుగుజాడల్లో నడుచుకోవాలన్నారు. సమాజంలో జీవించినంతకాలం ఒకరినొకరు ప్రేమానురాగాలు కలిగి ఉండాలన్నారు. దయ, జాలి, క్షమాగుణం మంచి లక్షణాలను అలవర్చుకోవాలన్నారు. తోటివారికి ఏ హాని తలపెట్టవదని బైబిల్ బోధిస్తోందన్నారు. క్రీస్తు పలికిన పది ఆజ్ఞలను అందరూ పాటించాలని సూచించారు. అనంతరం విశ్వాసులు, భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు ప్రేమవిందు ఇచ్చారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎం.జాన్ కోటేశ్వరరావు, పాస్టర్లు బి.కిషోర్‌బాబు, బి.తిమోతీ, సర్పంచి బొక్కా రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు మార్కపూడి లాజరు, స్త్రీలమైత్రీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ



జగ్గయ్యపేట అర్బన్: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలో సోమవారం శ్రీభగవద్రామానుజ గోష్ఠి ఆధ్వర్యంలో పలువురు నిరుపేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్థానిక పాలేటి తీరాన ఉన్న పురాతన దేవాలయమైన శ్రీభూ గోదా సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివార్లకు తొలుత జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఆయన తనయుడు శ్రీరాం సిద్ధూ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిరుపేదలు, వృద్ధులకు ఎమ్మెల్యే తాతయ్య చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భగవద్రామానుజ గోష్ఠి ప్రతినిధులు ఆకుల స్వాతికుమార్, విజయ దంపతులు, వార్డు కౌన్సిలర్ గొట్టి నాగరాజు, చెన్నకేశవస్వామి ఆలయ భక్తబృందం, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

చాట్రాయి: ముస్లిం సోదరులకు పవిత్రమైన బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని చనుబండ, నరశింహారావుపాలెం, పోలవరం, సోమవరం, కోటపాడు, చిత్తపూరు, చిన్నంపేట, తుమ్మగూడెం గ్రామాల్లోని ముస్లిం సోదరులు ఉదయం 10 గంటలకు ఆయా గ్రామాల్లోని ఆరుబయట తోటల్లో నమాజు చేశారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: బక్రీద్ సందర్భంగా సోమవారం స్థానిక మక్కా మసీదులో ముస్లింలు భక్తిశ్రద్ధలతో నమాజ్ చేశారు. ఈద్గాలో మత గురువు ముకరం హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించి, సందేశాన్ని ఇచ్చారు. త్యాగానికి ప్రత్యేకంగా నిలిచిన బక్రీద్ సందర్భంగా ప్రజల సుఖ సంతోషాలతో, సోదరభావంతో మెలగాలని ఆకాంక్షించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: త్యాగం, కరుణ, ఐక్యతకు సంకేతంగా నిర్వహించే బక్రీద్‌ను ఊటుకూరు, గంపలగూడెం, గోసవీడు, పెనుగొలను, వినగడప గ్రామాల్లో ఘనంగా జరిపారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

త్యాగనిరతిని పెంపొందించాలి..

మైలవరం: మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ ముఖ్య ఉద్దేశమని ముస్లిం మత గురువులు తెలిపారు. అన్ని గుణాలకన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమన్నారు. బక్రీద్ సందర్భంగా ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం వితరణగా ఇవ్వడం ముస్లిం మత ఆచారం అని గురువులు తెలిపారు. మైలవరం మసీదులో నమాజు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త సర్నాల తిరుపతిరావు పాల్గొని ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: మండల కేంద్రమైన రెడ్డిగూడెం మసీదులో బక్రీద్ సందర్భంగా మత గురువు మౌత్‌బిళ్ల ప్రత్యేకంగా ప్రార్థనలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మత గురువు మౌత్‌బిళ్ల మాట్లాడుతూ త్యాగం, భక్తి, విశ్వాసానికి ఈ పండుగ ప్రతీకని అన్నారు.

ఎ. కొండూరులో..

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, కృష్ణారావుపాలెం, కంభంపాడు, ఎ.కొండూరు గ్రామాల్లోని మసీదుల్లో ముస్లింలు సోమవారం బక్రీద్ సందర్భంగా ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇమామ్ షేక్ బషీర్ మాట్లాడుతూ ప్రవక్త సూచించిన మార్గాన్ని ఎంచుకుని ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అనంతరం ఒకరినొకరూ ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. కొందరూ ముస్లిం సోదరులు పొట్టేళ్ల కుర్బానీ నిత్య కార్యక్రమాన్ని నిర్వహించి కుర్బానీ మంసాన్ని పేదలకు పంపిణీ చేశారు. ఏఏఎంటీకే దర్బార్‌లో పీఠాధిపతి ఖాజా మొహియుద్దీన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కులమతాలకు అతీతంగా ప్రసాదాన్ని స్వీకరించి, మహ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరి బాబా వారి దివ్యసమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చాదర్, పువ్వులు, గ్రంథం సమర్పించి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ ఖాదర్ మొహియుద్దీన్, జాఫర్ షరీఫ్, తాజ్ ఖాదర్‌బాబు, కరీముల్లా, జానీ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు రూరల్‌లో..

తిరువూరురూరల్: మండలంలోని గానుగపాడు, రాజుగూడెం, మునుకుళ్ల, పెద్దవరం, ఆంజనేయపురం గ్రామాల్లో ముస్లింలు ఈ వేడుకల్లో పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు.

నూజివీడులో..

నూజివీడు: బక్రీద్ పర్వదినాన్ని సోమవారం ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పర్వదినం సందర్భంగా పట్టణంలోని, మండలంలోని ముస్లింలు ప్రార్థనలు చేసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని మైలవరం రోడ్డులో ఉన్న ఈద్గాలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు.

తిరువూరు పట్టణంలో..

తిరువూరు: పట్టణంలోని మల్లమ్మ చెరువు సమీపంలోని ఈద్గావద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. జామియా మసీదు ఇమాం మౌల్వీ రజ్వీ బక్రీద్ పర్వదిన ప్రాధాన్యతను వివరించారు. ప్రతి ఒక్కరూ త్యాగనిరతి కలిగి ఉండాలని, స్వార్థం, అసూయ, రాగద్వేషాలకు అతీతంగా మానవతా దృక్పథంతో వ్యవహరించాలని రజ్వీ ఉద్బోధించారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో సోమవారం నిర్వహించారు. స్థానిక గ్యామిమా మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


చనుబండలో నమాజ్ చేస్తున్న ముస్లింలు


విస్సన్నపేటలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు


చీమలపాడు ఈద్గా వద్ద ప్రసంగిస్తున్న ఈమామ్ బషీర్


తిరువూరు మండలం గానుగపాడులో ముస్లింల ప్రార్థనలు


తిరువూరులో బక్రీద్ ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


ఊటుకూరులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు


మైలవరంలోని మసీదులో ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సర్నాల తిరుపతిరావు

పిడుగుపడి ధ్వజస్తంభం స్వల్పంగా ధ్వంసం

అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): గ్రామంలో సోమవారం రాత్రి గాలి దుమ్ము, ఉరుములతో కూడిన భారీవర్షం కురిసింది. సుమారు రెండు గంటలపాటు కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రామాలయంలోని ధ్వజస్తంభంపై భారీ శబ్దంతో పిడుగు పడటంతో ధ్వజస్తంభం స్వల్పంగా ధ్వంసమైంది.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని

కేసరపల్లి(గన్నవరం): విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 44 మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం రోటరీక్లబ్ ఆధ్వర్యాన యుఎస్ఏకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని రావిపాటి సిరిలాస్య రూ. 50 వేలతో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.

ఆలయాల్లో వైభవంగా వార్షికోత్సవం

గోసవీడు(గంపలగూడెం): మండలంలోని గోసవీడులో పలు ఆలయాల్లో ప్రథమ వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని గంగా పార్వతీ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం పునర్నిర్మాణం, బొడ్డురాయి, భక్తాంజనేయస్వామి ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ, గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, అక్కలమ్మ దేవతల ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయింది. దీంతో ఆయా ఆలయాల్లో అర్చకులు అరిపిరాల అప్పయ్యశాస్త్రి, అర్చక బృందంచే దేవతామూర్తులకు పంచామృతాలతో అభిషేకం చేశారు. ముత్యాలమ్మ, అక్కలమ్మలకు భక్తులు బోనాలు సమర్పించారు. శివాలయంలో లోకకల్యాణార్థం శాంతికల్యాణం వైభవంగా జరిపారు. పలువురు దంపతుల పీటలపై కూర్చొని కన్యాదానం చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.


గోసవీడు శివాలయంలో శాంతికల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగూడెం చెరువులో భారీగా మట్టి తోలకాలు

చంద్రగూడెం(మైలవరం): మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలోని కొత్త చెరువులో మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో భారీ మట్టి తోలకాలు సోమవారం ప్రారంభమయ్యాయి. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఏర్పాటు చేసి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారు. మైలవరం నియోజకవర్గంలో సహజ వనరులకు కొదువలేదు. అందులో భాగంగా రైతుల పేర్లు చెప్పి, అనుమతులు లేకపోయినా అధికారికంగా రైతులకు గ్రావెల్ తోలుతున్నామనే నెపంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి మట్టి రవాణా చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులను విచారిస్తే తాము ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


చంద్రగూడెం చెరువులో ట్రాక్టర్లతో రవాణా అవుతున్న మట్టి

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ఓ వివాహితతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చిల్లకల్లు ఎస్ఐ సతీష్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. చిల్లకల్లుకు చెందిన పాపబత్తిన జయపాల్, గ్రామంలో ఫౌండేషన్ ద్వారా మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ తరగతులు నిర్వహిస్తుంటారు. ఈ ఫౌండేషన్‌లో శిక్షకురాలిగా పనిచేస్తున్న జగ్గయ్యపేటకు చెందిన ఓ వివాహితతో సోమవారం మధ్యాహ్నం జయపాల్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె తన కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన..

మహిళలపట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న జయపాల్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ కుటుంబసభ్యులు, మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు చిల్లకల్లు పోలీసుస్టేషన్ ఎదుట వారు సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. కుట్టుశిక్షణకు వచ్చే పలువురు మహిళలతోనూ జయపాల్ అసభ్యకరంగా ప్రవర్తిస్తుంటాడని, అతనిపై కేసులు ఉన్నాయని పోలీసులు పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన విషయం తెలుసుకున్న సీఐ జానకీరామ్ ఆందోళనకారులతో మాట్లాడారు. నిందితుడిపై చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చి వారిచే ఆందోళనను విరమింపజేశారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

నందిగామ: ఏకాదశి పర్వదినంతోపాటు సోమవారం కూడా కలిసిరావడంతో మండలంలోని ఆయా శివాలయాలలో భక్తులు విశేష పూజలు చేశారు. నందిగామలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కూడలి సంగమేశ్వరస్వామి, పట్టణ శివారు మున్నేటి తీరం వద్ద గల విజ్ఞాన నందీశ్వరస్వామి, పల్లగిరి గుట్టపై గల స్వయంభు శివలింగం వద్ద భక్తులు అభిషేకాలతోపాటు పూజలు చేశారు.



బాబా మందిరంలో అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో సోమవారం బక్రీద్ పురస్కరించుకుని అన్నదానం జరిగింది. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దాతల సహ కారంతో వెజిటబుల్ బిర్యానీ పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.